
## అడల్ట్స్ ఓన్లీ కథ A



# అబ్బనీ తియ్యనీ దెబ్బ!

డా. పేరాల శ్రవణ్‌కుమార్



రోడ్డు ప్రక్కనే ఉన్న ఆ బురద గుంటలో పడ్డ మా అమిత్‌గాడి రొట్టెమాత్రం విరిగి నేతిలోనే పడింది! కారణం- అదే గుంటలో తన డ్రీంగాళ్ 'జయ' కూడా పడడమే! ఆమెనలా హత్తుకుంటుంటే మత్తులో చిత్తైపోతున్న అమిత్‌కి బురదేకదా భూతల స్వర్గం అనిపించినట్టుంది. తన బలహీనమైన గుండెని బలంగా తాకిన శుభవేళ... డాక్టర్ అవసరం లేకుండానే 'గుండెమార్పిడి' జరిగిపోయింది.

చోద్యం చూస్తున్న మా మిత్రబృందానికి బురదలో పద్మంలా జయ, ఆ పద్మానికి కాడలా అమిత్‌గాడూ అద్భుతంగా గోచరించేరు.

సిగ్గుపడుతూ, బురదలో తడిసిన ముంగురులు కంగారుగా సవరించుకుంటూ లేచింది జయ. తన ప్రాణాలు కాపాడిన అమిత్‌వేపు ఆమె చూసిన ఆ అనురాగపు చూపులు చాలు ఎన్నో తెలుగు సినిమాలు తెగ చూసిన మాకు సీనర్థమైపోడానికి. అమిత్‌గాడి సంగతి చెప్పనే అక్ఖర్లేదు. ఆమె రిక్షా చేసుకుని ఇంటికి వెళ్ళిపోయినా క్యూలెక్స్ దోమలా దొర్లుతూనే ఉన్నాడా గుంటలో పడి. వాణ్ణి రెక్కట్టుకు లేపి, కడిగి 'మా పార్టీ కార్యాలయం (అనగా రాజేష్ రూంకి) తీసుకుపోయాం 'పార్టీ' పనిమీద. ఇక ఫ్లాష్ బ్యాక్‌లో కెళ్తే....

★ ★ ★

డిగ్రీ ఫైనలియర్ బ్యాచ్‌లో అమిత్‌గాడు మోస్ట్ పాపులర్ ఫెలో. కళ్ళు తిరిగేంత అందగాడూ కాదు, కాదనీ కాదు. ఆరడుగుల పొడవూ, చక్కగా వాగడం వాడి స్పెషాలిటీస్. ఫుట్‌బాల్ టీంకి కెప్టెనూ వాడే. జిల్లాస్థాయి డిబేట్ కాంపిటీషన్స్ ప్రైజులూ వాడివే. చదువులో ఏవరేజ్ అయినా అందుకే ప్రిన్సిపాల్‌గారికీ వాడంటే ఇష్టం.

జూనియర్ అమ్మాయిల్ని ర్యాగ్ చేసి ఏడ్పించడం, వాళ్ళ రూపురేఖల్ని బట్టి నిక్‌నేమ్స్ పెట్టి అల్లరిచేయడం వాడి హాబీస్. తన కాలేజ్ అమ్మాయిల్ని బైట వాళ్ళు అల్లరిచేస్తే ఊర్కోకపోడం, ప్రేమజంటలకి సపోర్టిచ్చి వాళ్ళకి పెళ్ళిళ్ళు చేయడంలాంటి సుగుణాలవల్ల గాళ్స్‌కీ వాడంటే ఇష్టమే!

వాడిలాగే అమితాబ్ అంత పొడుగూ ఉంది వాడి అసలుపేరు సత్యసూర్యవేంకట వరలక్ష్మీప్రసాద్ అని. హైట్‌ని బట్టి అమిత్ అని 'కిస్‌నేం' (అనగా ముద్దు పేరు) పెట్టేశాం వాడికి. ప్రసాద్ అంటే కాలేజిలో తెలీదు. అమిత్ అంటే ఇంట్లో తెలీదు.

ఆ సంవత్సరమే కాలేజ్‌లో అడుగుపెట్టింది ఆల్చిప్పల్లాంటి కళ్ళతో బెదురు చూపులు చూస్తూ హంసలా ఒయ్యారంగా మధులత. పేరుమోసిన క్రిమినల్ లాయర్ ఫణీంద్రగారి ఏకైక పుత్రిక. పసిడీ, చందనం రంగరించినట్టు మిస మిసలాడే మేని వర్ణం. పొట్టిగా ఉన్న మేనికి తగ్గట్టుగా ఉన్న అవయవ సౌందర్యం. లంగా ఓణీల్లో సింగారాలు పోయేది. పిరుదులపై లయబద్ధంగా ఊగే ఆ జడకుప్పెలు కుర్రాళ్ళ గుండెల్ని లయతప్పించి 'కుప్పిగంతు' లేయించేవి.

''మధూ అన్న పేరెంత బావున్నా అలా తిరగేస్తే ఎలా చెప్పు'' తన అల్లరికి ధుమధుమ లాడే ఆమె ముఖాన్ని ముద్దుగా చూస్తూ అనేవాడు.

పొట్టిగా ఉన్న లతకి జయబాధురి అని పేరు పెట్టి 'జయా జయా' అనే పిల్చేవాడు. వాడికి 'మ్యాచ్' అయ్యే పేరు పెట్టాడని గుర్రుగా ఉన్నా ఆమెకి తగ్గ పేరు కావడంతో ఆ పేరు పాపులర్ చేశాం అందరం. ఇంట్లో లత కాలేజీలోకొచ్చేక జయ అయిపోయింది.

అమితంగా టీజ్ చేస్తున్న అమిత్ మీద ఎంత కోపం ఉన్నా సీనియర్ అనే గౌరవంతో ఊరుకుంది జయ చాల్రోజులు. ఆ రోజు క్లాసులైపోయి అందరం బిలబిలా బైటికొస్తున్నాం. అమిత్ ఏం లంచం ఎర చూపించేడోగానీ జయ వాళ్ళ బ్యాచ్ కుర్రాడొకడు ఆమెని సమీపించాడు.

''వొదినా! అమిత్ అన్నయ్య ఆగమంటున్నాడు. ఏవో మాట్లాడాలట'' అంటూ తుర్రుమన్నాడు. 'అన్నా-వదిన' అనే సంబోధనలు వింటూ గొల్లుమని నవ్వేరు ఆమె ఫ్రెండ్స్. లత ఆగిపోయింది జేవురించిన మొహంతో.

వడివడిగా నడుస్తూ ఆనందంగా వొచ్చేడు అమిత్ ''ఏం లేదు. మన 'దారులొకటే'గా. కలిసి నడుద్దామనీ!'' శ్లేషార్థంతో అన్నాడు కొంటెగా 'అలిగిన వేళనే' జయని చూడాలని.

ఆమె అలగలేదు సరికదా నవ్వింది. అమిత్‌లో ఏదో ఆశ చిగురించేంతలోనే ఆమె చూపు మార్చింది. అనుకోని వేగంతో ఆమె చేతిలోని హైహీల్ చెప్పు అమిత్ చెంపల్ని ఎడాపెడా వాయించేసింది.

''కాలేజికొచ్చేది చదువుకోడానికా ఇలాంటి ఛండాలపు పన్లకా? మీ తల్లిదండ్రులంటే ఏమాత్రం గౌరవం ఉన్నా ఇలాంటి పనులు మాను. బుద్ధిగా చదువుకునే విద్యార్థికే భవిష్యత్తు బావుంటుంది. ఆశలే తప్ప ఆశయాల్లేని నీలాంటి వాణ్ణి నాలాంటి ఆడపిల్ల చచ్చినా ప్రేమించదు''

విజయశాంతిలా క్లాస్ పీకి వీరనారిలా వెళ్ళిపోయింది.

★ ★ ★

## డేర్ అండ్ డ్యాషింగ్

**మంచి హైట్, హైట్‌కి తగ్గ అందం ఉన్న కత్రినాకైఫ్ ఇప్పుడు చాలా డేర్‌గా మాట్లాడుతోంది. 'సినిమా నటులంటే అందరికీ అలుసే. మా వ్యక్తిగత జీవితాలపై వారికి ఎంతో ఆసక్తి. సెల్‌ఫోన్ మెసేజ్‌లు, ఎంఎంఎస్‌లు, కెమేరా ఫోన్‌లతో తారల్ని వెంటాడం ఎంతవరకూ సమంజసం?' అంటోంది కత్రినా. అందరికీ ప్రైవసీ ఉన్నట్టే మాకు కూడా ఉంటుంది కదా. అదెందుకు మీరు అర్థం చేసుకోరంటోంది ఈ భామ. ఇటు తెలుగులో బిజీగా ఉంటూనే బాలీవుడ్‌లో తన బాయ్ ఫ్రెండ్‌తో తెగ తిరుగుతోంది.**



రాజేష్‌గాడి రూంలో పార్టీ మీటింగ్ ఏర్పాటు చేశాం. హడావిడిగా. మా గ్రూప్‌లో ఎవడికే కష్టం వచ్చినా సుఖం వచ్చినా 'పార్టీ' మీటింగ్ తప్పదు. ఎర్రగా పొంగిన బుగ్గలతో, నిద్రలేని కళ్ళతో, కాస్త పెరిగిన గడ్డంతో దేవదాస్ బామ్మర్దిలా ఉన్నాడు అమిత్.

''ఆ పొట్టిపిల్లకెంత పొగర్రా!''

''ఆ జయని దెబ్బకు దెబ్బ తీయాలి!''

''దానిచేత సారీ చెప్పిస్తాం!''

''నిన్ను చెప్పుతో కొడ్తుందా!''

మయసభానంతరం దుర్యోధనుడికి దన్ను నిలిచిన కౌరవుల్లా పేట్రేగిపోయాం.

''నోర్ముయ్యండ్రా! అన్ని దెబ్బలూ ఒకలా ఉండవ్. తియ్యటి దెబ్బలూ ఉంటాయి. తియ్యటి నెప్పులూ ఉంటాయ్'' కొట్టిన జయనే వెనకేసుకొచ్చేడు అమిత్.

''అంటే..అది లాగి ఒకటిచ్చుకునేవాళ్ళని బట్టి ఉంటుంద్రా బ్రెదరూ!! ఐనా..నిన్ను చచ్చినా ప్రేమించనూ అంది కదా బ్రెదరూ'' పెగ్గేస్తే చాలు బ్రెయిన్ ఉబ్బుతుంది మా రాజేష్‌గాడికి.

''అక్కడే పప్పులో కాలేశావ్! నన్నన్ని మాటలంది కాని 'నీకు అక్కా చెల్లీ లేరా' అని ఒక్కమాటందా! లేదే! ఆ యాంగిల్లోంచి ఆలోచించార్రా! ఔనన్నా, కాదన్నా ఆమె నా ప్రాణం. ఆమెనేమైనా అన్నారో సింపుల్‌గా మీ ప్రాణాల్తీస్తా!''

అంతే. పార్టీలు మానేశాడు. తెల్లచొక్కాలు, నుదుట బొట్టూ, క్లాసులో శ్రద్ధగా వింటాలూ, ఆడపిల్లల్ని ఆమాటకొస్తే జయని కూడా కన్నెత్తి చూట్టం లేదు. యూనిట్ టెస్టుల్లో బోల్డు మార్కులు తెచ్చుకుని లెక్చరర్లకి హార్ట్‌ఎటాక్ తెప్పించినంత పన్జేశాడు.

ఆరోజు...ఆ బురదగుంట వాడి ప్రేమకథని అందమైన మలుపే తిప్పింది. కాలేజ్ నించి ఇంటికి నడిచెళ్తోన్న జయ వెనకాలే అతి దగ్గరగా ఓ లోడ్ లారీ దూసుకురావడం, డ్రైవర్ కూడా లోడ్‌లో ఉండడం వల్ల లారీ అదుపుతప్పడం, కొంచెం దూరంలో ప్రవరాఖ్యుడిలా తలొంచుకు నడుస్తోన్న అమిత్‌గాడు ఎందుకో తలెత్తి చూసి, కీడు శంకించి, ఒక్కఉదుట్న జయ రెక్కట్టుకు పక్కకి లాగడం, అమిత్, జయ రోడ్డు పక్కనే బురదగుంటలో ఒకరిపై ఒకరు పడడం సెకన్ల వ్యవధిలో జరిగిపోయేయి. లారీ కాస్త చెట్టుకి గుద్దుకుంది. బిలబిలమంటూ అందరం చేరాం. కాలేజ్ దగ్గర్లోనే ఇది జరగడంతో డ్రైవర్‌కి దేహశుద్ధీ, అమిత్‌కి కార్యసిద్ధీ ఒకేసారి జరిగేయి. ఇక వర్తమానంలోకొద్దాం.

ప్రాణాల్ని ఫణంగా పెట్టి మరీ తనని కాపాడిన అమిత్ అంటే ప్రేమ సునామీలా పొంగింది జయలో. అంతకుముందే తన మాటకి విలువిచ్చి, తన దెబ్బలకి చెంపలిచ్చి 'గుడ్‌బోయ్'లా మారిపోయేడన్న విషయం తెల్సి ఏర్పడిన సాఫ్ట్ కార్నర్ ప్రేమగా రూపాంతరం చెందింది.

ఓరోజు బలవంతంగా తనే అమిత్‌ని కాంటీన్‌కి తీస్కెళ్ళింది కాలేజ్‌లో. ఐలవ్యూ కాకపోయినా, కనీసం వన్ ఫోర్ త్రీ అనేనా అంటాడని ఎదురుచూసింది. చివరికి తనే జాతీయభాషలో 'ఏక్ చార్ తీన్' అనేసింది.

''మరి...చచ్చినా నన్ను ప్రేమించనన్నావ్ కదమ్మా!'' ఎలాగా పడిపోయిందని అలగడం మొదలెట్టేడు అమిత్.

''చావకుండా బ్రతికించేవ్ కదా! నీ ప్రేమని కూడా బ్రతికిద్దామని!'' వాడి వాక్చాతుర్యం ఆమెకొచ్చింది. అంతే. ఆరోజునుంచీ అడపాదడపా స్వీట్ నథింగ్సూ, హాట్ సమ్‌థింగ్సూ జరుగుతున్నాయ్ వాళ్ళమధ్య.

కూతురు మీద నమ్మకం ఉన్నా తన ఆరోగ్యం మీద నమ్మకం సడలిందేమో లతకి సంబంధాలు చూడ్డం మొదలెట్టేరు ఫణీంద్రగారు.

''ఇప్పట్నించే పెళ్ళేంటి డాడీ! డిగ్రీ ఐనా పూర్తి చెయ్యనీ!'' ఖండితంగా చెప్పేసింది లత.

ఆమె హైహీల్ మహిమేమో అమిత్‌గాడికి డిగ్రీలో మంచిమార్కులే వచ్చాయ్. మేమంతా పీజీలోకొచ్చినా వాడు క్లాస్ స్టూడెంట్‌గా ఎదిగాడు. వాళ్ళ ప్రేమాయణం కూడా మూడోకంటికి తెలీకుండా హద్దుమీరకుండా సాగుతూనే ఉంది. ఎమ్మెస్సీలో కూడా మంచి మార్కుల్తో పాసై కాలేజ్‌కే పేరుతెచ్చాడు. వాడి మిత్రబృందంగా ఎంతో గర్వపడ్డాం.

వాడు ఉద్యోగాల కోసం పరీక్షలకి ప్రిపేర్ అవుతున్నాడు. మేం కూడా ఏవో బాధలు పడుతున్నాం.

ఫణీంద్రగారు కూతురు మాట వినడం మానేసి 'మారేజ్‌ల పరేష్'గాణ్ణి పిల్చి ఆమెకి సంబంధాలు చూడమని పురమాయించేట్ట.


డిగ్రీ అయిపోయిన లత పీజీ చేయనీ అంటోంది. ఆయనకి అనుమానం పొడసూపింది.

''చూడమ్మా! నీమీద నాకు నమ్మకమే. మీ అమ్మే ఉంటే ఈపాటికి అప్పడాల కర్ర లెన్ని విరిగేవో నా నడ్డిమీద. మంచి సంబంధాలెందుకు కాదంటున్నావ్? చూడమ్మా! నాకు చెప్పకుండా నువ్వు ఎవర్నైనా పెళ్ళి చేస్కున్నా, లేచిపోయినా నేను నిన్నేమీ అనను. కానీ ఈ విషం బాటిల్ మింగి ఛస్తా!'' భద్రంగా దాచుకున్న విషం బాటిల్ ఆమెకి చూపించి దాచేశాడు. లత గుండెలు గుభేల్మన్నాయ్.

★ ★ ★

## ప్చ్...పాపం!

**'ఇడియట్' సినిమా తర్వాత అందాల తార రక్షితకి అనుకోని అవకాశాలు వచ్చినా బాక్సాఫీస్ దగ్గర ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తాకొడితే తనేం చేస్తుంది పాపం. ఇప్పుడు 'జగపతి-ఏ సెంటరైనా ఓకె' అంటూ జనం ముందుకి వచ్చిన ఈ భామ అన్ని సెంటర్లలో వీకే అన్పించింది. జనాన్ని అలరించేందుకు మసాలాలాంటి సన్నివేశాల్లో తన అందచందాల్ని ఆరబోసినా ఫలితం ప్చ్..అన్నట్టుగానే ఉంది. ఇదిలా ఉంటే ఈ సినిమా సెన్సార్‌పై కూడా కొన్ని 'నీలి'నీడలు పరుచుకున్నాయి. ఇలా నటించాక కూడా ఆమె సక్సెస్‌కి చేరువకాకపోతే ముమ్ముందు ఆమెని పిలిచి అవకాశాలిచ్చే వారెవరబ్బా?**



రామనాథంగారికెందుకో అమిత్‌గాడి వాలకం చూస్తే అప్పుడప్పుడు డౌటొస్తోంది. తనెన్ని సార్లు మొత్తుకున్నా చదవనివాడు ఎందుకిలా విరగబడి చదివేసి ఇన్నేసి మార్కులు తెచ్చుకుంటున్నాడు?

''ఒరే ప్రసాదూ! నువ్వు బుద్ధిమంతుడివే. కాదన్ను. నేను కూడా చాలా సంప్రదాయవాదిని. నాకు తెలీకుండా ప్రేమా దోమా అంటూ ఏ పిల్లనైనా లేవదీసుకొచ్చేవో పరువుకోసం నేనూ మీ అమ్మా ప్రాణాలైనా తీస్కుంటాం'' విషం సీసా చూపించేడు.

''ఏమిటి నాన్నా నీ పిచ్చి'' అన్నాడేగాని గుండెలు గుభేల్‌మన్నాయ్.

''నేనొద్దన్నా సంబంధాలు చూస్తున్నాడు నాన్న. ఆయనెదిరించి డైలాగ్స్ చెప్పడం నాకు రాదు. తర్వాత నీ ఇష్టం'' అల్టిమేటం ఇచ్చింది జయ ఓరోజు.

''నీకెందుకు బాసూ మేం ఉన్నాం కదా!'' అంటున్నామేగానీ ఏం చెయ్యాలో తోచట్లేదు. విషాల విషయం చర్చకొచ్చింది.

''చెప్పకుండా పెళ్ళి చేస్కుంటే కదా విషాలు మింగి చస్తామన్నారు మీ డాడీలూ. చెప్పే చేస్కుంటే పోలా?'' యధాలాపంగా పేపరు చదువుతూ అన్నాడు రాజేష్. వాణ్ణి మింగేసేలా చూశాడు అమిత్.

''చేస్కుంటానని చెప్తే చెప్పుతెగేలా కొట్టి బైటికి పంపిస్తాడు. లేదా రౌడీల్నీ పోలీసుల్నీ ఏకకాలంలో ప్రయోగించి అసలు నేను పెళ్ళికే పనికిరాకుండా చేసేగల్డు. నువ్విలాంటి కుళ్ళుజోకులేసే సమయం రా ఇదీ!'' గింజుకున్నాడు అమిత్.

''అదేం కాదురా. ఆల్రెడీ ప్లాన్ వర్కవుటయింది. ఇదిగో ఈ వార్త చూడు'' అంటూ పేపర్లో వార్త చూపించేడు. 'అన్నవరం దేవస్థానంలో ఆదివారం సామూహిక వివాహాలు'. తన ప్లాన్ మా అందరికీ వివరించేడు. అమిత్ కళ్ళలో ఆశలు.

భలే ప్లాన్. వర్కవుటయితే సుఖాంతమే. ఆదివారం అమిత్‌కీ జయకీ అన్నవరంలో పెళ్ళిచేయాలని నిశ్చయించేం. అందరం డబ్బు లేస్కుని టాక్సీ మాట్లాడేం.

★ ★ ★

ఆదివారం ఉదయం. ఫ్రెండ్స్ అంతా టాక్సీలో ముందుగా జయ వాళ్ళింటికెళ్ళాం.

ఫణీంద్రగారు పేపర్లో లీనమై ఉండగా జయ క్లాస్ బుక్స్‌తో కుస్తీ పడుతోంది.

''సార్! ఇవాళ అన్నవరంలో మా ఫ్రెండ్ అమిత్‌కీ, జయకీ పెళ్ళి. అందరం వెళ్తున్నాం. లతని పంపరూ''

''ఔను నాన్నా! మర్చిపోయా. మీరు కూడా పెళ్ళికి వచ్చి ఆశీర్వదించండి. దైవదర్శనం కూడా అవుతుంది'' చిన్నపిల్లలా బతిమాలింది.

''నాకెక్కడవుతుంది లేమ్మా. మీరెళ్ళిరండి'' లక్ష జాగ్రత్తలు చెప్పి మరీ పంపేరు. లతతో బాటు అదే టాక్సీలో అమిత్ ఇంటికెళ్ళాం.

''అంకుల్! అన్నవరంలో మా ఫ్రెండ్స్ అమిత్, జయల పెళ్ళి. ప్రసాద్‌ని పంపరూ! వాడు లేకపోతే సందడే లేదు మాకు'' అన్నాను.

''బ్యాంక్ టెస్ట్‌కి ప్రిపేరవుతున్నా! ఎలా వెళ్ళను'' గునిగాడు అమిత్‌గాడు.

''సర్లేరా నువు చదూకో. మేమే వెళ్ళొస్తాం'' అన్నాడు రాజేష్. ఖంగుతిన్న అమిత్ ''లేదులేరా! అమిత్‌గాడు ఫీలౌతాడు. నేవస్తాలే'' అంటూ ''నాన్నా! మీరు, అమ్మా కూడా రావాల్సిందే, ఆశీర్వదించాల్సిందే'' మొండిగా అన్నాడు.

''మీ అమ్మకా కీళ్ళనెప్పులు. అనుకోకుండా నాకు సెలవెవరిస్తారు? మీ రెళ్ళిరండి''

''అమ్మయ్య. పిలుపులు పిలిచేశేం. వాళ్ళే రాలేం అన్నారు. ఇక చెప్పకుండా పెళ్ళి చేస్కున్నారనే అభియోగం వేసి విషం తాగే ఛాన్సు పోగొట్టుకున్నారు'' నవ్వుకుంటూ టాక్సీని అన్నవరం కేసి దూకించాం.

★ ★ ★

అన్నవరంలో సామూహిక వివాహ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

''వధూవరుల తల్లిదండ్రులేరి!' ఒకాయన పేచీ.

''ఇద్దరూ మేజర్లేనండి. ఇష్టపడి చేస్కుంటున్నారు. మేమంతా సాక్షులం. ఇవిగో వాళ్ళ బర్త్ సర్టిఫికెట్స్''

మధ్యాహ్నానికల్లా జయ, అమిత్ అనబడే మధులత, ప్రసాద్‌ల వివాహంబు, మా భోజనంబు మిత్రుల కేరింతల మధ్య జరిగిపోయాయి. ఘన విజయం సాధించిన ఆనందంతో ఊరిదారి పట్టేం.

★ ★ ★

కళ్ళముందు మధుపర్కాల్తో నిలబడ్డ కూతుర్నీ, అమిత్‌నీ చూసి షాకై విషం బాటిల్ కోసం పరిగెత్తబోతున్న ఫణీంద్రగార్ని ఆపేం.

''అంకుల్! మీరు స్వయంగా లాయర్ కదా! ఇది చెప్పండి. వాళ్ళిద్దరూ మేజర్లు, ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకున్నారు. ఏ చట్టప్రకారం తప్పు? పైగా మీకు చెప్పి మరీ చేసుకున్నారు.''

''నాకేం చెప్పారు? ఎవరో అమిత, జయ అన్నారు'' కోపంతో అన్నాడు ఫణీంద్ర.

''అవి మేం వాళ్ళిద్దరికీ ఎప్పట్నించో పెట్టిన నిక్‌నేమ్స్. ఏవేనా వాళ్ళ పేర్లేగా. మీరు విషం తాగుతానంటే వాళ్ళూ తాగుతానంటారు. అప్పుడేం చేస్తారు?''

''ఒక్కొక్కడూ సుప్రీంకోర్టు లాయర్లలా వాదిస్తున్నారే? కుర్రాడు బుద్ధిమంతుడైతే నాకేం అభ్యంతరం?'' శుభం కార్డేశాడు చేసేదిలేక.

అందరం రామనాధంగారింటి కెళ్ళాం. విషం బాటిల్ వెతకనీయకుండా ఆయన చేతులు పట్టుకుని సేమ్ డైలాగులు వల్లించేం.

''ఈ తెలివితేటలు చదువులో చూపించండోయ్ బాగుపడతారు! అయినా బంగారంలాంటి కోడలొస్తే కాదంటానా!'' అన్నాడాయన.

''వివాహం విద్య నాశాయ కానీకు ప్రసాదూ ఎలియాస్ అమిత్!'' నవ్వుతూ అన్నారు రామనాధంగారు.

''హైహీల్ దెబ్బ మహిమంకుల్. మీవాడికి హైటెక్ జాబ్ వస్తుంది'' మిత్రబృందం జోకులకి సిగ్గుపడిపోయింది జయ అలియాస్ మధులత.

☆

## సమ్‌థింగ్ స్పెషల్

**ఎప్పుడూ సినిమాలంటే బోర్‌గా ఉంటుందెవరికైనా! ఇప్పుడు లగాన్ హీరోయిన్ అందాల భామ గ్రేసీసింగ్ అలాగే అంటోంది. తన కొత్త అపార్ట్‌మెంట్‌లోకి దిగిన ఈభామ ఎప్పుడూ సినిమా కథలు వినడం, ఆఫర్ల గురించి వాకబు చేయడం చేస్తోంది. అన్నట్టు ఆమె ఇంటినిండా గురునానక్ ఫోటోలే దర్శనం ఇస్తాయిట. ఇదిలా ఉంటే ఇప్పుడామె బుల్లితెర వైపు మొగ్గుచూపుతోంది. ఈ అందాలభామ తెలుగులో మళ్లీ ఎప్పుడు నటిస్తుందా అని అంతా ఎదురుచూస్తున్నారు.**

